క్లుప్తంగా

రక్తదానం.. ప్రాణదానం



రక్తదాతలకు సర్టిఫికెట్లు ఇస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

పుల్లంపేట : రక్తదానం చేసి ప్రాణాలు కాపాడండి అనే నినాదంతో మండలంలోని పలువురు దాతలు ఆదివారం పుల్లంపేటలోని ఎస్‌బీవీడీ సభా పాఠశాల ప్రాంగణంలో వంద మంది యువకులు రక్తదానం చేసి తమ దాతృత్వాన్ని చాటారు. అయోధ్య రామ మందిరం నిర్మాణం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులకు గుర్తుగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పుల్లంపేట ఎస్ఐ రఘురాం ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదానం చేసిన యువకులను అభినందించారు. కడప రిమ్స్ వైద్యులు, రెడ్ క్రాస్ సొసైటీ వారు రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందించారు.

ఓటరు జాబితాలో తప్పులు సవరించుకోండి



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యానందం

నందలూరు (రాజంపేట) : ఓటరు జాబితాలో తప్పులు ఉంటే సరిదిద్దుకోవాలని తహసీల్దార్ సత్యానందం పేర్కొన్నారు. ఆదివారం ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రతి పోలింగ్ కేంద్రంలో నూతన ఓటర్ల జాబితాను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు ఉందోలేదో చూసుకోవాలన్నారు. తప్పులు ఉంటే బీఎల్‌ఓలను సంప్రదించాలన్నారు. మండలంలోని 33 పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, డిప్యూటీ తహసీల్దార్ మోహన్, వీఆర్‌ఓ చంద్ర శేఖర్ రాజు, సర్వేయర్ చంద్ర, బీఎల్‌ఓలు మౌనిక, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

7న ఈటమాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం

పెనగలూరు : ఈనెల 7వ తేదీన ఈటమాపురం పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుందని ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7వ తేదీన ఈటమాపురం, రాజుపాలెం, అరుంధతివాడ, తూర్పుపల్లి, హరిజనవాడ, కురవల్లు, నాయుడువారిపల్లి అరుంధతివాడలలో కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధికారులందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

ఆర్థికసాయం



సరుకులు అందజేస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె : ప్రమాదంలో గాయపడిన దివ్యాంగురాలు భారతీని పరామర్శించి నగదు సాయంతోపాటు మందులను అందించినట్టు వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం రీజనల్ కో–ఆర్డినేటర్ చెర్లోపల్లి రెడ్డప్ప పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీకి రూ.10వేలు విలువజేసే సరుకులతోపాటు మందుల ఖర్చుల కోసం రూ. 5 వేలను అందించామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం మండల అధ్యక్షుడు అబ్దుల్ ఖలీల్, జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చాన్ బాషా, జేఏసీ జిల్లా అధ్యక్షుడు సురేంద్ర, జేఏసీ నాయకులు రాజమ్మ, నాగమల్లమ్మ, భారతీ, వలంటీర్ నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

8న వాహన వేలం

సిద్దవటం : ఎస్ఈబీ అధికారులు 24/2022 కేసులో పట్టుబడిన వాహనానికి ఈనెల 8వ తేదీన బహిరంగ వేలంపాటను నిర్వహిస్తున్నట్లు సిద్దవటం ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ఉరుకుందమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టుబడిన వాహనంకు మండల కేంద్రంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసు స్టేషన్ ఆవరణలో ఉదయం 11 గంటలకు వేలంపాటను నిర్వహిస్తామన్నారు. పాటలో పాల్గొనే వారు అధార్‌కార్డుతో హాజరై, నిర్ణయించిన ధరావత్తును చెల్లించి వేలంలో పాల్గొనవచ్చునని ఆమె ప్రకటనలో పేర్కొన్నారు.

కడప బాలోత్సవానికి చురుగ్గా ఏర్పాట్లు

కడప కల్చరల్ : కడప బాలోత్సవ నిర్వహణకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 11న కడప నగరం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో పోటీలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు బాలోత్సవం కన్వీనింగ్ కమిటీ ప్రతినిధి, పూర్వ ఎమ్మెల్సీ గేయానంద్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం కళాశాలను సందర్శించింది. ఈనెల 11న కళాశాలలో బాలోత్సవంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీ నిర్వహించనున్నారు. పోటీలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లను ఈ బృందం పర్యవేక్షించింది. గేయానంద్ మాట్లాడుతూ బాలోత్సవాన్ని విజయవంతం చేసేందుకు కళాశాలలు, పాఠశాలలు, తల్లిదండ్రులు, విద్యార్థులు సహకారం అందించాలని కోరారు.

సౌకర్యాల కల్పనే జగనన్న ధ్యేయం

ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న మైనార్టీలు



నిర్మాణంలో ఉన్న వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట రూరల్ : ప్రజలందరికి సౌకర్యాలను కల్పించి వారికి అండగా నిలబడటమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. మండల పరిధిలోని భువనగిరిపల్లెకు వెళ్లే రహదారిలో నిర్మిస్తున్న వంతెనను వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక ప్రజలతో కలిసి ఆదివారం మేడా పరిశీలించారు. వంతెన నిర్మాణానికి రూ.25 లక్షల నిధులను ఎమ్మెల్యే కేటాయించేలా చొరవ చూపడంతో స్థానికులు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా భువనగిరిపల్లి ప్రజలు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా భువనగిరిపల్లెకు వెళ్లే దారిలో వర్షాకాలం వస్తే అలుగు నీరు ప్రవహించడం జరిగేదన్నారు. సమస్యను తెలుసుకున్న ఎమ్మెల్యే మేడా సమస్య శాశ్వత పరిష్కారం చూపారని తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మేడా మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సౌకర్యాలు కల్పించేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగ పృథ్వీపతిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఎంఎల్ నరసయ్య, ఎంఎల్ నారాయణ, ఎంపీటీసీ నాగ శేఖర్‌రెడ్డి, గ్రామ నాయకులు కె.నరసింహులు, బీఎల్ఎన్, ఎన్.రఘుపతి, కె.హరీష్, వై.మల్లి, కె.శివయ్య, కె.వెంకటరమణ, కేఎస్ నరసింహులు, భువనగిరి లక్ష్మి నరసింహస్వామి దేవస్థానం కమిటీ ధర్మకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

శ్మశాన రక్షణ గోడ కోసం మైనార్టీలు వినతి

మండల పరిధిలోని ఊటుకూరు గ్రామంలో ఉన్న శ్మశానం చుట్టూ రక్షణ గోడ లేకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని మత పెద్దలు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి విన్నవించారు. శ్మశానం చుట్టూ రక్షణ గోడ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. వీలైనంత త్వరగా రక్షణ గోడ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యే మేడాకు వినతి పత్రం అందజేశారు. ఇందులో ఊటుకూరు మత పెద్దలు షేక్ మౌలానా, ఖాజా, హబీబ్, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగ పృథ్వీపతిరెడ్డి, కె.శ్రీనివాసులు, టి.నరసింహులు, ఎం.బక్కయ్య పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలపై ఎంఈఓపై విచారణ

ఓబులవారిపల్లె : మండల విద్యాధికారిణి పద్మజ అవినీతికి పాల్పడినట్టు ఉపాధ్యాయులు విద్యాశాఖ ఉన్నత అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. ఇందులో ప్రధానంగా ఉపాధ్యాయుల మెడికల్ రీయింబర్స్‌మెంట్, ఇంక్రిమెంట్ అరియర్స్ బిల్లులు, పర్సనల్ లోన్‌లకు సంబంధించి ఫారం నెంబర్ – 16 ఇచ్చేందుకు, ఉపాధ్యాయుల బదిలీలలో ఎల్‌పీసీ, ఎస్ఆర్‌లు, మెడికల్ లీవ్‌ల మంజూరునకు డబ్బు తీసుకున్నట్టు మండలంలో విధులు నిర్వహిస్తున్న 26 మంది ఉపాధ్యాయులు ప్రాంతీయ విద్యా సంయుక్త సంచాలకులు ఆర్‌జేడీ ఎం.వెంకటకృష్ణారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ విషయంపై ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డిని వివరణ కోరగా ఆరోపణలపై శాఖ పరమైన విచారణ చేస్తున్నామన్నారు. ఇప్పటికే షోకాజ్ నోటీసు జారీ చేశామన్నారు. విచారణలో ఆరోపణలు నిరూపితం అయితే ఎంఈఓపై చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

‘దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి’



మాట్లాడుతున్న సుధీర్‌కుమార్

రాయచోటి అర్బన్ : ఎన్టీఆర్ జిల్లా కంచికర్లకు చెందిన దళిత యువకుడు శ్యామ్‌కుమార్‌పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని డీహెచ్‌పీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండేళ్ల క్రితం జరిగిన ఒక సంఘటనతో ఎటువంటి సంబంధం లేనప్పటికీ దళిత యువకుడు శ్యామ్‌కుమార్‌ను కొందరు కిడ్నాప్ చేసి కిరాతకంగా దాడి చేస్తూ విజయవాడ – గుంటూరు మధ్య వాహనంలో తిప్పారన్నారు. తీవ్రంగా గాయపడ్డ శ్యామ్‌కుమార్ దాహం వేస్తోంది నీళ్లు కావాలంటూ కోరగా మూత్రం తాపించడం దారుణమన్నారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్, మానవ హక్కుల కమిషన్‌లు ఈ ఘటన పట్ల ప్రత్యేక దృష్టిని సారించి నిందితులను తక్షణం అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్ చేశారు. సమావేశంలో డీహెచ్‌పీఎస్ జిల్లా నేతలు మంచాల హరి, వండాడి రెడ్డిసుధాకర్ పాల్గొన్నారు.

రైతన్నలపై కరుణించిన వరుణుడు



రాయచోటి: రాయచోటి - మదనపల్లె రహదారిలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

రాయచోటి : పట్టణంలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షంతో వీధులన్నీ జలమయమయ్యాయి. నెలన్నర రోజులుగా వర్షం కోసం ఎదురు చూసిన రైతులకు ఈ వర్షం కాస్త ఊరటనిచ్చింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి వర్షం కురుస్తుండటంతో అన్ని వర్గాల్లో ఆనందం వ్యక్తమైంది. ముఖ్యంగా ఖరీఫ్‌లో సాగైన వర్షాధార పంటలకు ఈ వర్షపు జల్లులు ఊపిరి పోశాయి. ఏది ఏమైనా వర్షం రాకతో వాతావరణం చల్లబడింది.



పెనగలూరులో కురుస్తున్న వర్షం

పెనగలూరులో ఓ మోస్తరు వర్షం

పెనగలూరు : మండలంలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతులు కొంత మేర ఊపిరి పీల్చుకున్నారు. గత రెండు నెలలుగా మండలంలో వర్షం కురవకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. బోర్లలో నీరురాక రైతులు ఇప్పటికే తిరిగి బోర్లు వేయించే పనిలో పడ్డారు. ఆదివారం కురిసిన ఓ మోస్తరు వర్షం పండ్లతోటలకు ఈ వర్షం ఎంతగానో ఉపయోపడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

కడప అర్బన్: ఖాజీపేట మండలం భూమయ్యగారి పల్లె నుంచి మూడు రోజుల క్రితం గుర్తుతెలియని వృద్ధుడు(70) అనారోగ్యంతో బాధపడుతుండగా స్థానికుల సహకారంతో 108లో కడపలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) క్యాజువాలిటీలో చేర్పించారు. డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి అతను చనిపోయాడని నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. అతనికి బంధువులు ఎవరూలేకపోవడంతో ఖాజీపేట పోలీస్ స్టేషన్ వారు కడపలోని శ్రీ కాశీ విశ్వనాథ సేవాసమితి వారిని సంప్రదించారు. దీంతో వారు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. శ్రీనాగుల వీరభద్రయ్య బ్రాహ్మణ అన్నదాన ట్రస్ట్ వారి సహకారంతో హిందూ సంప్రదాయం ప్రకారం వృద్ధుని మృతదేహానికి అంత్యక్రియలను నిర్వహించారు.

అధిక ఫీజుల వసూలు

వైవీయూ : పదో తరగతి పరీక్ష ఫీజును ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే అధికంగా వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పదోతరగతి పరీక్ష ఫీజు రూ.125గా ప్రభుత్వం నిర్ణయిస్తే కొన్ని పాఠశాలలు రూ.1500 నుంచి రూ.2 వేల వరకు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నాయన్నారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

దూదేకులు రాజకీయంగా ఎదగాలి

కడప సెవెన్‌రోడ్స్: దూదేకుల కులస్తులు రాజకీయంగా ఎదగాలని దూదేకుల సంక్షేమ సంఘ నాయకులు ఖాదర్‌బాషా అన్నారు. ఆదివారం నగరంలోని దూదేకుల భవన్‌లో టీటీడీ బోర్డు సభ్యుడు యానాదయ్య సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమష్టి పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. నాగూర్ మాట్లాడుతూ ప్రొద్దుటూరులో ఇంటి స్థలాలు ఇప్పించే ప్రయత్నం చేస్తున్నామన్నారు.

అభివృద్ధి చేసిన వ్యక్తులను మరవకూడదు

జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి, స్కిల్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి



మాట్లాడుతున్న కొండూరు అజయ్‌రెడ్డిలు, పక్కనే జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

పెనగలూరు : ఒక మండలాన్ని లేదా ఒక ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన వ్యక్తులను ఎన్నడూ మరచిపోరాదని జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ కొండూరు అజయ్ రెడ్డిలు అన్నారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రమైన పెనగలూరు హైస్కూల్ వద్ద రావుబహదూర్ అవార్డు గ్రహీత పుట్టంరెడ్డి రాఘవరెడ్డి విగ్రహాన్ని వారు ప్రారంభించారు. రాఘవరెడ్డి మనువరాలు సుమిత్రమ్మ, మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బీఎల్ నరసింహారెడ్డిల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆకేపాటి, అజయ్ రెడ్డిలు మాట్లాడుతూ బ్రిటీష్ కాలంలో పెనగలూరుకు రాజంపేట నుంచి మొట్టమొదట రోడ్డు వేసిన వ్యక్తి పుట్టంరెడ్డి రాఘవరెడ్డి అని వారు కొనియాడారు. అలాగే పెనగలూరుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పాఠశాలను కూడా ప్రారంభించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. దీంతోపాటు కడప జిల్లా బోర్డు ప్రెసిడెంటుగా 1939 నుంచి ఆరు సంవత్సరాలపాటు రెండు పర్యాయాలు పనిచేశారన్నారు. అప్పట్లో చెన్నూరు నదిపై పాత బ్రిడ్జి, పోలీస్ స్టేషన్ కూడా అప్పట్లో తీసుకువచ్చారన్నారు. ఆయన తరువాత ఈ మండలాన్ని మాజీ ఎమ్మెల్యేలు అయిన కొండూరు మారారెడ్డి, కొండూరు ప్రభావతమ్మలు అభివృద్ధిలో దూసుకుపోయిందన్నారు. ఎప్పటికీ రాఘవరెడ్డిని గుర్తించుకునేలా ఆయన విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బీఎల్ నరసింహారెడ్డి మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి చేసిన వారి కృషిని మరువకూడదన్నారు. కార్యక్రమంలో రాఘవరెడ్డి మనువరాలు సుమిత్రమ్మ, సిద్దార్థ రెడ్డి, పిచ్చిరెడ్డి, యానాది నాయుడు, సురేష్ రెడ్డి, ఆకుల చిన్న, రమణ, పెంచలయ్య, శివారెడ్డి, కందల జయరామయ్య, సానారెడ్డి, శ్రీరాముల రెడ్డితోపాటు మండలంలోని సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన అవసరం

వైవీయూ : సమాజంపై అవగాహన, బాధ్యత ఎంతో అవసరమని రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ ఎస్. మాసూంబాషా పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలోని ఐఎంఏ సమావేశ మందిరంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలని సూచించారు. అనంతరం వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ, చిత్రలేఖన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ మాసూంబాషా జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు రెడ్డప్ప, ఖాదర్ బాషా, జవహర్‌రెడ్డి, శ్రీనివాసులు, బాలగంగాధర్‌రెడ్డి, కిశోర్, అశోక్‌కుమార్, అజీముల్లా పాల్గొన్నారు.

23న రామేశ్వరానికి బస్సుసర్వీసు

పీలేరు రూరల్ : కార్తీక మాసం పురస్కరించుకుని ఈ నెల 23న పీలేరు నుంచి రామేశ్వరానికి ప్రత్యేక బస్సుసర్వీసు నడుపనున్నట్లు డిపో మేనేజర్ బి. కుమార్ తెలిపారు. 40 సీట్ల సామర్థ్యం గల అల్ట్రా డీలక్స్ బస్సు పీలేరులో బయలుదేరి రామేశ్వరం, తిరుచందూర్, శ్రీరంగం, సమయపురం, తంజావూరు, చిదంబరం, తిరునల్లార్, వైదీవ్వరన్, స్వామిమలై, కుంభకోణం తోపాటు చివరగా 26న అరుణాచలం గిరిప్రదక్షిణ చూసుకుని తిరిగి పీలేరు చేరుకుంటుందని తెలిపారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న విద్యార్థి నాయకులు

రాయచోటి అర్బన్ : కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఈనెల 8వ తేదీన కేజీ టు పీజీ విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పలు విద్యార్థి సంఘాల నేతలు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో వారు విద్యాసంస్థల బంద్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ప్రాణత్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరించడాన్ని నిరసిస్తూ జరుగుతున్న పోరాటం నవంబరు 8వతేదీ నాటికి వెయ్యి రోజులవుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. లాభాలు సంపాదిస్తున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి అనుబంధంగా కేంద్రప్రభుత్వం గనులను కేటాయించకపోగా, ప్రైవేటీకరించాలని చూస్తుండడం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యత్నాలను మానుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. విభజన చట్టంలో ఉన్నా కడపలో ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయకపోవడం అన్యాయమన్నారు. ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం ఒకపైసా కూడా నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. నవంబరు 8న జరుప తలపెట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలంటూ కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, అధ్యక్షుడు మాధవ్, ఉపాధ్యక్షుడు అభిరామ్, సహాయకార్యదర్శి బాలసుబ్రమణ్యం, కోశాధికారి వినయ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి జోగేశ్వర్‌లు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సముచిత స్థానం

కలికిరి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తరువాతే ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు సముచిత స్థానం లభించిందని వైఎస్సార్‌సీపీ మైనారీ, బీసీ, ఎస్సీ నేతలు అన్నారు. వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికారత బస్సు యాత్రకు వస్తున్న ప్రజాధరణను చూసి ఓర్వలేని స్థానిక టీడీపీ నేతలు అసత్య ప్రచారాలు చేస్తుండటంపై నేతలు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. టీడీపీ హయాంలో దళితులుగా ఎవరు పుట్టాలనుకుంటారని, దళితులకు రాజకీయాలు అవసరం లేదన్న టీడీపీ నాయకుల వ్యాఖ్యలను ప్రజలు ఎప్పటికీ మరువరని గుర్తుచేశారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలు రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించారన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి బీసీలను వెనుకబడిన కులాలుగా కాకుండా బ్యాక్ బోన్ కులాలుగా గుర్తించారన్నారు. సామాజిక సాధికారిత బస్సు యాత్రపై విమర్శలు చేస్తున్న టీడీపీ నేతలు ఒక్కసారి ఆత్మ విమర్శచేసుకోవాలని హితవులు పలికారు. మరోసారి అనుచిత విమర్శలు చేస్తే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు ఎంఐ హనీఫ్, ఎంపీటీసీ సభ్యుడు భోగేష్, నాయకులు మల్లికార్జున, ఖాదర్ బాషా. నరేష్, విశ్వనాథ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని విమర్శించే అర్హత లేదు...

నియోజకవర్గంలో టీడీపీ నాయకులకు వైఎస్సార్‌సీపీని విమర్శించే అర్హతే లేదని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్టీడి హరి అన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డి నిత్యం ప్రజల్లో ఉండి ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నారని, వచ్చే ఎన్నికలలో సైతం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు వైఎస్సార్‌సీపీ వెంటే నిలబడతారన్నారు. టీడీపీ గతంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలను చిన్నచూసిన విషయాన్ని ప్రజలు మరువరన్నారు.

ఘనంగా వరల్డ్ సండే స్కూల్ సంబరాలు

కడప కార్పొరేషన్: రక్షణ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పి. సంపత్ కుమార్ ఆధ్వర్యంలో వరల్డ్ సండే స్కూల్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం యేసు పిలుచుచున్నాడు ప్రార్థనా గోపురంలో పిల్లల మధ్య కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లలు దేవుని మార్గంలో నడిచి సత్‌ప్రవర్తన కలిగి, సమాజంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ సునీల్, స్కూల్ టీచర్స్ పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



లక్కిరెడ్డిపల్లె: ప్రత్యేక అలంకరణలో గంగమ్మ



రైల్వేకోడూరు అర్బన్: అలంకారంలో కోడూరు గంగమ్మ



సంబేపల్లె: నల్లగంగమ్మ దర్శనం కోసం క్యూ లైన్‌లో వేచివున్న భక్తులు

లక్కిరెడ్డిపల్లె : వర్షాలు కురిపించి ప్రజలు సుభిక్షంగా ఉండేలా చూడు గంగమ్మతల్లి అంటూ ఆదివారం అనంతపురం గంగమ్మ దేవతకు భక్తులు బోనాలు, తలనీలాలు అర్పించి ప్రత్యేక పూజలు చేయించారు. గంగమ్మ దేవతకు ఆలయ పూజారులు ఆదిమూలం వంశీయులు రెడ్డి శేఖర్, చంద్రశేఖర్‌లు అమ్మవారికి అభిషేకం చేయడంతోపాటు కుంకుమార్చనలు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. చుట్టుపక్కల ప్రాంతాల వారే కాకుండా ఇతర జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

సిద్దవటం : ఇరుగులమ్మకు ఆదివారం భక్తులు పూజలు నిర్వహించామని ఆలయ పూజారి వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన, కుంకుమార్చన, అర్చనలు వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. భక్తులకు పుల్లంపేట మండలం ఈడుగపల్లి గ్రామానికి చెందిన డొంక వెంకటయ్య, సుధామణి దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారు.

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని కొత్తకోడూరులో ఆదివారం ఘనంగా గంగమ్మకు పూజలు నిర్వహించారు. ఉదయం ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించి భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సంబేపల్లె : శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే అమ్మవారికి పూజలు ప్రారంభమయ్యాయి. అమ్మవారి దర్శనార్థం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొర్లేరు రాతిపై పొర్లారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



సిద్దవటం: పూజలందుకున్న ఇరుగులమ్మ